సాక్షి
హనుమకొండ
శనివారం, 24 ఆగస్టు 2024



‘ఓపెన్’గా చదివేద్దాం - 8లో

డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ ఓపెన్ యూనివర్సిటీలో ఈ విద్యాసంవత్సరానికి గాను డిగ్రీ, పీజీ కోర్సుల్లో ప్రవేశాలు పొందవచ్చని వర్సిటీ జాయింట్ డైరెక్టర్ వెంకటేశ్వర్లు తెలిపారు.



ప్రజల దృష్టి మరల్చేందుకే..

ప్రజా సమస్యల నుంచి దృష్టిని మరల్చేందుకే బీజేపీ, బీఆర్ఎస్ పార్టీ ఫిరాయింపులపై పరస్పరం ఆరోపణలు చేసుకుంటున్నాయని డాక్టర్ కె. నారాయణ అన్నారు. - 8లో

గరిష్టం/కనిష్టం
31°/24°

వాతావరణం

జిల్లాలో ఉదయం నుంచి ఆకాశం మేఘావృతమై ఉంటుంది. మధ్యాహ్నం ఎండ ఉంటుంది. సాయంత్రం అక్కడక్కడ చిరు జల్లులు కురిసే అవకాశం ఉంది.

న్యూస్‌రీల్

శిక్షణ పొందిన అభ్యర్థులకు పరీక్షలు



హన్మకొండ చౌరస్తా: హనుమకొండలోని కేడీసీ ఎదురుగా ఉన్న ప్రభుత్వ వృత్తి నైపుణ్య శిక్షణ కేంద్రంలో ఎంఎస్ ఆఫీస్, బ్యూటీషియన్, మొబైల్ సర్వీసింగ్, రిఫ్రిజిరేషన్, ఏసీ, ఫ్యాషన్ డిజైనింగ్, గార్మెంట్ మేకింగ్‌లో శిక్షణ పొందిన అభ్యర్థులకు శుక్రవారం పరీక్షలు నిర్వహించారు. హైదరాబాద్ సెట్విన్ నుంచి నాగేశ్వర్ రావు హాజరై పరీక్షలను పర్యవేక్షించారు. నిరుద్యోగులు వృత్తి శిక్షణను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. శిక్షణ పొందిన 51మందికి గాను 49 మంది అభ్యర్థులు హాజరైనట్లు డీవైఎస్ఓ అశోక్ తెలిపారు. పరీక్ష పర్యవేక్షణలో వై.విజయశ్రీ, సిబ్బంది పాల్గొన్నారు.

‘జూడా’ల సమ్మె విరమణ.. నేటినుంచి విధుల్లోకి..

ఎంజీఎం : కోల్‌కతాలో జరిగిన యువ వైద్యురాలి హత్యాచారం నిందితులను కఠినంగా శిక్షించాలని, కేంద్ర రక్షణ చట్టం, జూనియర్ డాక్టర్ల(జూడా)కు మౌలిక సదుపాయాలు కల్పించాలని కోరుతూ పది రోజులుగా జూనియర్ డాక్టర్లు ఎంజీఎం ఆవరణలో చేస్తున్న నిరసన దర్నా, సమ్మెను సుప్రీంకోర్టు, రాష్ట్ర ప్రభుత్వం భరోసాతో శుక్రవారం విరమించారు. ఎంజీఎం ఆస్పత్రిలో జూడాలకు విశ్రాంతి గదులు, వాష్‌రూమ్‌లు, సెక్యూరిటీ కల్పిస్తామని సూపరింటెండెంట్ డాక్టర్ మురళి హామీ ఇచ్చారు. ఈ మేరకు పనులు వేగవంతం చేసినట్లు తెలిపారు. శనివారం నుంచి జూడాలు ఓపీలు, ఎలెక్టివ్, ఎమర్జెన్సీ విధులకు హాజరవుతారని ప్రకటించారు. కాగా, బాధితురాలికి న్యాయం జరిగే వరకు విధుల అనంతరం నిరసన కార్యక్రమాలు చేస్తామని తెలిపారు.

ఓవర్‌లోడ్ వాహనాల తనిఖీ



హన్మకొండ: ఓవర్‌లోడ్‌తో వెళ్తున్న వాహనాలను విజిలెన్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు తనిఖీ చేసి రూ.4లక్షల జరిమానా విధించారు. గురువారం రాత్రి హనుమకొండ జిల్లాలోని గుడెప్పాడ్, కోమటిపల్లి క్రాస్ రోడ్‌లో జాతీయ రహదారిపై విజిలెన్స్, ఎన్‌ఫోర్స్‌మెంట్, గనులు, రవాణా శాఖ, కమర్షియల్ టాక్స్ అధికారులు వాహనాల తనిఖీ నిర్వహించారు. ఇసుక, గ్రావెల్‌తో ఓవర్‌లోడ్‌తో వెళ్తున్న 12 లారీలను పట్టుకున్నారు. వీటికి దాదాపు రూ.4 లక్షల జరిమానా విధించినట్లు వరంగల్ విజిలెన్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారి, అదనపు సూపరింటెండెంట్ ఆఫ్ పోలీస్ ఎ.బాలకోటి తెలిపారు.

ఓటరు జాబితాలో సవరణలకు అవకాశం



హన్మకొండ: ఓటర్ల జాబితాలో సవరణకు ఎన్నికల సంఘం అవకాశం కల్పించిందని, ఈ అవకాశాన్ని ఓటర్లు సద్వినియోగం చేసుకోవాలని హనుమకొండ అదనపు కలెక్టర్ వెంకట్‌రెడ్డి అన్నారు. శుక్రవారం హనుమకొండ కలెక్టరేట్‌లోని మినీ కాన్ఫరెన్స్ హాల్‌లో కలెక్టర్ ఆదేశాల మేరకు ఫొటో వివరాలతో కూడిన ఓటర్ల జాబితా ప్రత్యేక సవరణపై వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశం నిర్వహించారు. ఇందులో అదనపు కలెక్టర్ వెంకట్‌రెడ్డి మాట్లాడుతూ.. ఈనెల 20వ తేదీ నుంచి అక్టోబర్ 18 వరకు ఓటర్ల జాబితాలో సవరణకు అవకాశం కల్పించినట్లు తెలిపారు. బీఎల్ఓలకు రాజకీయ నాయకులు సహకరించాలని కోరారు. సమావేశంలో ఎన్నికల విభాగం సూపరింటెండెంట్ ప్రసాదరావు, ఆయా రాజకీయ పార్టీల ప్రతినిధులు ఈవీ.శ్రీనివాస్ రావు, నిశాంత్, రజినీకాంత్, ఎండీ నేహాల్, శ్యాంసుందర్, లక్ష్మణ్, ప్రభాకర్‌రెడ్డి, ఎండి.ఫైజుల్లా, జయంత్‌లాల్ పాల్గొన్నారు.

జీఆర్పీలో బదిలీలు

కాజీపేట : వరంగల్ ప్రభుత్వ రైల్వే పోలీసు (జీఆర్పీ)లో బదిలీలు జరిగాయి. వరంగల్ జీఆర్పీ నూతన సీఐగా పి.సురేందర్ శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. నిర్మల్ సీసీఎస్‌లో పని చేస్తున్న సురేందర్ బదిలీపై ఇక్కడికి వచ్చారు. ఇక్కడ పని చేస్తున్న సీఐ జి.నరేశ్ మల్టీజోన్–1 ఐజీకి రిపోర్టు చేయాలని, అదేవిధంగా ఎస్సై ఐలయ్య కూడా జోన్ ఐజీకి రిపోర్టు చేయాలని ఉన్నతాధికారులు ఉత్తర్వులు జారీ చేశారు. ఈసందర్భంగా నూతనంగా వచ్చిన సీఐకి సిబ్బంది అభినందనలు తెలిపారు. బదిలీపై వెళ్తున్న సీఐ నరేశ్, ఎస్సై ఐలయ్యను సన్మానించి వీడ్కోలు పలికారు.

సామర్థ్యాలు పెంచడమే లక్ష్యం

- ఈ ఏడాది పలు మార్పులతో ‘ఎఫ్ఎల్ఎన్’
- జిల్లాలో 385 పాఠశాలల్లో అమలు
- విద్యార్థుల్లో పెరగనున్న అభ్యసన సామర్థ్యాలు



విద్యారణ్యపురి: జిల్లాలోని అనేక ప్రభుత్వ పాఠశాలల విద్యార్థుల్లో అభ్యసన సామర్థ్యాలు కరువవుతున్నాయి. దీంతో.. ఆయా విద్యార్థుల్లో ఆత్మనూన్యత పెరిగి డ్రాపవుట్స్‌గా మారుతున్నారు. ఈపరిస్థితి నుంచి మార్పు తీసుకొచ్చేందుకు కనీస సామర్థ్యాల పెంపుదలే లక్ష్యంగా.. ఎఫ్ఎల్ఎన్ (ఫౌండేషన్ లిటరసీ అండ్ న్యూమరసీ) కోసం ఉపాధ్యాయులు కృషి చేయాల్సి ఉంది. గత విద్యా సంవత్సరంలో చేపట్టిన ఎఫ్ఎల్ఎన్‌లో కొన్ని మార్పులు చేర్పులతో ప్రస్తుత విద్యాసంవత్సరంలో అమలు చేయాలని విద్యాశాఖ ఉన్నతాధికారులు జిల్లాల అధికారులను ఇటీవల ఆదేశించారు. హనుమకొండ జిల్లాలో 385 ప్రాథమిక, ప్రాథమికోన్నత పాఠశాలల్లోని 1 నుంచి 5 తరగతుల విద్యార్థులకు ఈ ఎఫ్ఎల్ఎన్ అమలుకు ఉపక్రమించారు. ఈసారి విద్యార్థులతో అసైన్‌మెంట్ షీట్ రాయించనున్నారు. ఉపాధ్యాయుల పీరియడ్ ప్రణాళికల్లో మార్పులు చేసి సాఫ్ట్ కాపీలను ఆన్‌లైన్‌లో పొందుపర్చారు. విద్యార్థుల వర్క్ షీట్లలో మార్పులు చేసి ఈ సంవత్సరం ప్రతీ విద్యార్థికి అందించారు. కాగా.. జిల్లాలోని విద్యార్థుల సామర్థ్యాలను అధికారులు పరిశీలించి ఎప్పటికప్పుడు స్కూల్ ఎడ్యుకేషన్ యాప్‌లో అప్‌లోడ్ చేయనున్నారు.

ఈనెలలో బేస్ లైన్ టెస్ట్

కనీస విద్యా సామర్థ్యాలైన ఓరల్ రీడింగ్, ఫ్లూయెన్సీ రీడింగ్, కాంప్రహెన్సివ్ రైటింగ్, తరగతిని బట్టి గుణింతాలు, భాగాహారాలు, లెక్కలు చేయడం వింటివి విద్యార్థులకు రావాల్సి ఉంటుంది. అందుకోసం జిల్లా అధికారులు ప్రత్యేక చర్యలు తీసుకోనున్నారు. గతేడాది వరకు ప్రతీ నెల ఎఫ్ఎల్ఎన్ పరీక్ష నిర్వహించారు. కానీ.. ఈ విద్యా సంవత్సరం ఈనెలలో బేస్ లైన్ టెస్ట్, డిసెంబర్‌లో మిడ్ టెస్ట్, మార్చిలో ఎండ్ లైన్ టెస్ట్ నిర్వహించనున్నారు.

నిరంతరం పర్యవేక్షించాలి..



జిల్లాలోని ఎంఈఓలు, మండల నోడల్ అధికారులు, స్కూల్ కాంప్లెక్స్ హెచ్‌ఎంలు నిరంతరం పాఠశాలలను పర్యవేక్షించాలి. విద్యార్థుల సామర్థ్యాలను మెరుగుపర్చేలా కృషి చేయాలి. తరగతి వారీగా విద్యార్థుల కనీస సామర్థ్యాలను సాధించేలా ప్రాథమిక పాఠశాలల ఉపాధ్యాయులు కృషి చేయాలి. ఎఫ్ఎల్ఎన్ కార్యక్రమాన్ని పకడ్బందీగా అమలు చేయాలి.

- డి.వాసంతి, డీఈఓ, హనుమకొండ

రిసోర్స్ గ్రూప్ ఏర్పాటు చేశాం..



స్కూల్ కాంప్లెక్స్ సమావేశాల్లో ఉపాధ్యాయుల సందేహాలు నివృత్తి చేయడం ద్వారా జిల్లాలో ఎఫ్ఎల్ఎన్ కార్యక్రమం విజయవంతంగా అమలు చేస్తాం. జిల్లాలో ఉపాధ్యాయులతో ఒక రిసోర్స్ గ్రూప్ ఏర్పాటు చేశాం. ఎప్పటికప్పుడు అప్‌గ్రేడ్ చేస్తాం. గతంలో నెలకోసారి పరీక్ష ఉండేది. ఇప్పుడు మూడు నెలలకోసారి పరీక్షలు నిర్వహించుకోవచ్చు. విద్యార్థుల వర్క్‌షీట్లలోనూ మార్పులు చేశారు.

- ఎ.శ్రీనివాస్, జిల్లా క్వాలిటీ కో-ఆర్డినేటర్

తీజ్..సంబురం



కాజీపేట దర్గా రోడ్‌లో గల రామాలయం వీధిలో గురువారం రాత్రి గిరిజనులు తీజ్ సంబరాలు జరుపుకున్నారు. 9వ రోజు గోధుమనార బుట్టలు తలపై పెట్టుకొని రామాలయం వీధినుంచి ఫాతిమానగర్ బ్రిడ్జి వరకు సంప్రదాయ నృత్యాలు చేసుకుంటూ ర్యాలీగా వెళ్లారు. అనంతరం వడ్డేపల్లి చెరువులో నిమజ్జనం చేశారు.

- కాజీపేట రూరల్

వేయిస్తంభాల దేవాలయంలో లక్ష్మీ అమ్మవారిగా రుద్రేశ్వరీదేవి, భద్రకాళి అమ్మవారు, రాజరాజేశ్వరీదేవి అమ్మవారు









భద్రకాళి ఆలయంలో భక్తుల రద్దీ

శ్రావణ శుక్రవారం సందడి

శ్రావణమాసం మూడో శుక్రవారాన్ని పురస్కరించుకుని నగరంలోని పలు దేవాలయాలు భక్తులతో కిక్కిరిశాయి. వేయిస్తంభాల ఆలయంలో రుద్రేశ్వరుడికి, రుద్రేశ్వరీ అమ్మవారికి లక్షపుష్పార్చన నిర్వహించారు. అమ్మవారిని లక్ష్మీదేవిగా అలంకరించి పూజలు చేశారు. భద్రకాళి దేవాలయంలో అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. ఎంజీఎం ఎదురుగా ఉన్న రాజరాజేశ్వరి ఆలయం, శ్రీసంతోషిమాత దేవాలయం, పద్మాక్షి ఆలయం, ఎక్సైజ్‌కాలనీ, అదాలత్ వెనుక ఉన్న వేంకటేశ్వరస్వామి ఆలయంలో అమ్మవార్లను లక్ష్మీదేవి స్వరూపంగా పూజలు చేశారు.

– హన్మకొండ కల్చరల్

గంజాయి విక్రయిస్తున్న యువకుడి అరెస్ట్

రూ.6,250 విలువైన గంజాయి, సెల్‌ఫోన్ స్వాధీనం

ఎల్కతుర్తి: గంజాయి అమ్ముతున్న ఓ వ్యక్తిని ముల్కనూరు పోలీసులు అరెస్టు చేశారు. అతడి నుంచి రూ.6,250 విలువైన గంజాయి, ఒక సెల్‌ఫోన్‌ను స్వాధీనం చేసుకున్నారు. సీఐ పులి రమేశ్ ముల్కనూరు పోలీస్‌స్టేషన్‌లో వివరాలు వెల్లడించారు. హసన్‌పర్తి మండలం పెగడపల్లికి చెందిన మాట్ల దిలీప్ 2022 నుంచి గుర్తు తెలియని వ్యక్తుల ద్వారా గంజాయి తాగడం అలవాటు చేసుకున్నాడు. నాగపూర్ నుంచి గంజాయి తెచ్చుకొని తాగుతున్నాడు. ఈక్రమంలో అతడికి డబ్బులు అవసరం ఉన్నప్పుడు తాను తెచ్చిన గంజాయిలో కొంత అమ్ముతున్నాడు. నాగ్‌పూర్ నుంచి తెచ్చిన గంజాయిని అమ్మేందుకు భీమదేవపల్లి మండలం కొత్తపల్లి శివారులో విక్రయిస్తుండగా.. పోలీసులను చూసి పారిపోయేందుకు ప్రయత్నించాడు. అతడిని పట్టుకుని గంజాయి స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్లు సీఐ తెలిపారు. అనంతరం కోర్టులో హాజరుపర్చినట్లు పేర్కొన్నారు. గంజాయి పట్టుకోవడంలో ప్రతిభ చూపిన ముల్కనూరు ఎస్సై సాయిబాబుతో పాటు సిబ్బంది నాగేశ్వర్‌రావు, తిరుపతి, మోహన్‌బాబు, వెంకటేశ్వర్లు, శోభన్‌బాబు, శివరాజు, రాజు, సదానందంను అభినందించారు.



గంజాయితో పట్టుబడిన వ్యక్తిని అరెస్ట్ చూపిస్తున్న సీఐ పులి రమేశ్

నూతన ఆర్‌ఓఆర్-2024 చట్టంపై చర్చ

- నలహాలు, సూచనలు ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తాం
- హనుమకొండ కలెక్టర్ ప్రావీణ్య

హన్మకొండ: హనుమకొండ కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాల్‌లో శుక్రవారం నూతన ఆర్ఓఆర్–2024 ముసాయిదా చట్టంపై చర్చా కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా పలువురు భూములకు సంబంధించిన హక్కుల సమస్యలు, మ్యుటేషన్, ధరణితో ఎదురవుతున్న ఇబ్బందులు, నూతన చట్టంలో తీసుకురావాల్సిన వివిధ అంశాలపై సలహాలు, సూచనలు ఇచ్చారు. ఆయా సలహాలు, సూచనలు ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లనున్నట్లు హనుమకొండ కలెక్టర్ పి.ప్రావీణ్య తెలిపారు. వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి మాట్లాడుతూ ప్రజా ప్రభుత్వం ప్రజల ఆలోచనల మేరకు నూతన చట్టం రూపొందిస్తుందన్నారు. ఈక్రమంలోనే సలహాలు, సూచనలు తీసుకుంటుందన్నారు. ‘కుడా’ చైర్మన్ ఇనగాల వెంకట్రాంరెడ్డి మాట్లాడుతూ.. వ్యవసాయ సంబంధిత అంశాలను తెలుసుకుని తదనుగుణంగా చట్టం రూపొందించడానికి ఇలాంటి కార్యక్రమాలు దోహదపడుతాయన్నారు. ఆర్డీఓ వెంకటేశ్ మాట్లాడుతూ.. ముసాయిదా చట్టంలో 20 సెక్షన్లతో వివిధ అంశాలను పొందుపర్చారని వివరించారు. వ్యవసాయ, వ్యవసాయేతర భూములకు సంబంధించి హక్కులను రూపొందించనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో జిల్లా అదనపు కలెక్టర్ వెంకట్‌రెడ్డి, పరకాల ఆర్డీఓ డాక్టర్ నారాయణ, వ్యవసాయ శాఖ జేడీ రవీందర్ సింగ్, అధికారులు, ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాల చైర్మన్లు, రైతు సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు.




మాట్లాడుతున్న హనుమకొండ కలెక్టర్ ప్రావీణ్య

మహిళలు, చిన్నారుల భద్రతకు అధిక ప్రాధాన్యం

నేర సమీక్షలో సీపీ అంబర్ కిషోర్ ఝా

వరంగల్ క్రైం: మహిళలు, చిన్నారుల భద్రతకు అధిక ప్రాధాన్యమివ్వాలని వరంగల్ పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా అధికారులకు సూచించారు. శుక్రవారం వరంగల్ పోలీస్ కమిషనరేట్ కార్యాలయంలో నెలవారీ నేర సమీక్ష నిర్వహించారు. ముందుగా జోన్ల వారీగా కేసులు, వాటి ప్రస్తుత స్థితిగతులు, నిందితుల అరెస్టులో జాప్యం తదితర అంశాలను సంబంధిత అధికారులను అడిగి తెలుసుకున్నారు. నేరాల నియంత్రణకు ఉన్నతాధికారులు సైతం రాత్రి సమయాల్లో పెట్రోలింగ్ నిర్వహిస్తూ కిందిస్థాయి సిబ్బంది పనితీరును పర్యవేక్షించాలని, ప్రధానంగా మహిళలు, పిల్లలపై నేరాలకు పాల్పడే వారిపై కఠినమైన సెక్షన్ల కింద కేసులు నమోదు చేయాలని ఆదేశించారు. వారికి తప్పకుండా శిక్షలు పడేలా అధికారులు నైపుణ్యంతో కూడిన దర్యాప్తు చేపట్టాలని సూచించారు. యువత తాత్కాలిక జల్సాల కోసం తప్పుడు మార్గాలను ఎంచుకుంటున్నారని, తద్వారా నేరాలకు పాల్పడుతున్నారని, స్టేషన్ అధికారులు స్టేషన్ పరిధిలో యువతకు దిశా నిర్దేశం చేసేందుకు చొరవ చూపాలన్నారు. విజిబుల్ పోలీసింగ్‌లో భాగంగా నిరంతరం పోలీస్ పెట్రోలింగ్ చేపట్టాలన్నారు. ముఖ్యంగా నేరాల కట్టడి కోసం సీసీ కెమెరాలే ఏర్పాటు చేయాలని, దీనికోసం ప్రజలను ప్రోత్సహించాల్సి ఉంటుందని వివరించారు. రోడ్డు ప్రమాదాల నివారణకు ప్రత్యేక చొరవ చూపడంతో పాటు, బ్లాక్ స్పాట్లలో ముందస్తు జాగ్రత్త చర్యలు చేపట్టాలన్నారు. సమావేశంలో సెంట్రల్, వెస్ట్‌జోన్ డీసీపీలు షేక్ సలీమా, రాజమహేంద్ర నాయక్, అదనపు డీసీపీలు, రవి, సురేశ్‌కుమార్, ఏసీపీలు, ఇన్‌స్పెక్టర్లు, సబ్ ఇన్‌స్పెక్టర్లు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న సీపీ అంబర్ కిషోర్ ఝా

ఉమ్మడి జిల్లా సమగ్రాభివృద్ధికి కట్టుబడి ఉన్న ప్రభుత్వం

- హైడ్రా మాదిరిగా నగరానికి డీసీపీ స్థాయి అధికారి నియామకం
- ఎంపీ కడియం కావ్య, ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి

హన్మకొండ: ఉమ్మడి వరంగల్ జిల్లా సమగ్రాభివృద్ధికి ప్రభుత్వం కట్టుబడి ఉందని వరంగల్ ఎంపీ కడియం కావ్య, ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి అన్నారు. హనుమకొండ బాలసముద్రంలోని చిల్డ్రన్స్ పార్కులో 15వ ఆర్థిక సంఘం నిధులు రూ.2 కోట్లతో దివ్యాంగ చిన్నారుల కోసం నిర్మించనున్న వసతిగృహం, ఆడిటోరియం, పార్కు సుందరీకరణ పనులను శుక్రవారం ఎంపీ కడియం కావ్య, వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి, ‘కుడా’ చైర్మన్ ఇనగాల వెంకట్రామిరెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎంపీ కావ్య మాట్లాడుతూ మహానగర అభివృద్ధిపై రాష్ట్ర ప్రభుత్వం వద్ద ప్రణాళికలున్నాయని తెలిపారు. ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి మాట్లాడుతూ హైడ్రా తరహా మాదిరిగా వరంగల్ మహానగరానికి డీసీపీ స్థాయి అధికారిని నియమించనున్నట్లు చెప్పారు. తద్వారా కబ్జాలకు గురైన పార్క్ స్థలాలు, ప్రభుత్వ, ప్రైవేట్ స్థలాలకు విముక్తి కానుందన్నారు. కార్యక్రమంలో 7వ డివిజన్ కార్పొరేటర్ వేముల శ్రీనివాస్, మాజీ కార్పొరేటర్ కేశిరెడ్డి మాధవి, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు బంక సంపత్ యాదవ్, నాయకులు నాయిని లక్ష్మారెడ్డి, బొంత సారంగం, రమేష్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎంపీ కడియం కావ్య, ఎమ్మెల్యే నాయిని, ‘కుడా’ చైర్మన్ ఇనగాల

హైడ్రా తరహా సంస్థ ఏర్పాటుకు ప్రతిపాదన

హైదరాబాద్ డిజాస్టర్ రెస్పాన్స్ అండ్ అసెట్ మానిటరింగ్ అండ్ ప్రొటెక్షన్ (హైడ్రా) వంటి సంస్థను వరంగల్ నగరంలో ఏర్పాటు చేయాలని ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి గురువారం సీపీ అంబర్ కిశోర్ ఝాను కలిసి వినతిపత్రం అందించారు. ఈ ప్రతిపాదనను ప్రభుత్వానికి పంపుతున్నట్లు ఎమ్మెల్యే నాయిని చెప్పారు. పార్కులు అసాంఘిక కార్యక్రమాలకు అడ్డాగా మారాయని, పోలీసులు ప్రత్యేక నిఘా పెట్టి నివారించాలని కోరారు.

ఆలయాల భూములకు రక్షణేది?

హన్మకొండ కల్చరల్: ఉమ్మడి వరంగల్ జిల్లాలో వందల ఏళ్లనాటి దేవాలయాల భూములు ఆక్రమణలకు గురవుతున్నాయి. అయినప్పటికీ ఆలయాల భూముల పరిరక్షణలో దేవాదాయశాఖ అధికారులు ఉదాసీనంగా వ్యవహరిస్తున్నారు. రాజకీయ నాయకుల అండదండలు, చట్టాల్లో లోసుగులు ఆలయ భూకబ్జాదారులకు వరంగా మారాయి. దేవాలయాల భూములకు లెక్కలు లేవు. రెవెన్యూ అధికారులు సర్వే చేపట్టడం లేదు. రాజకీయ పలుకుబడితో కోట్ల రూపాయల విలువైన స్థలాలు ఆక్రమించేశారు. ‘దేవాలయాల భూములు ఆక్రమిస్తే ఊరుకోం. చర్యలు తీసుకుంటాం’ అని దేవాదాయశాఖ అధికారులు అంటున్నారే తప్ప.. చర్యలు తీసుకోవడానికి మాత్రం సాహసించడం లేదు. కొన్ని చోట్ల దేవాలయ భూములకు చెందిన స్థలాల్లో బోర్డులు కూడా పెట్టలేదు.

విచారణకు అధికారి గైర్హాజరు

రంగసాయకస్వామి, పద్మాక్షి దేవాలయం, వీర పిచ్చమాంబ, వేణు గోపాలస్వామి దేవాలయాలకు సంబంధించిన 20.39 ఎకరాల అక్రమ కబ్జాలపై లోకాయుక్తలో 2022లో వినియోగదారుల మండలి రాష్ట్ర అధ్యక్షుడు సాంబరాజు చక్రపాణి, కాకతీయ వారసత్వ సంపద పరిరక్షణ సమితి కన్వీనర్ చీకటి రాజు దేవాలయాల భూమి అక్రమ కబ్జాపై లోకాయుక్తలో ఫిర్యాదు చేశారు. శుక్రవారం లోకాయుక్తలో విచారణ జరిగింది. ఈవిచారణకు పద్మాక్షి దేవాలయం, సిద్ధేశ్వరస్వామి దేవాలయం కార్యనిర్వహణాధికారులు మాత్రమే హాజరయ్యారు. వరంగల్ దేవాదాయశాఖ అసిస్టెంట్ కమిషనర్ హాజరు కాకపోవడంతో తదుపరి వాయిదా అక్టోబర్ 3న తెలంగాణ రాష్ట్ర దేవాదాయశాఖ కమిషనర్ తప్పనిసరిగా హాజరు కావాలని లోకాయుక్త జస్టిస్ సీవీ రాములు ఆదేశించారు.

పారదర్శకతకు పాతర!

- అభివృద్ధి పనుల్లో అయోమయం
- సాంకేతికతకు ‘గ్రేటర్’ దూరం

వరంగల్ అర్బన్: వరంగల్ మహా నగర పాలక సంస్థలోని ఇంజనీరింగ్ విభాగంలో పారదర్శకత లోపించింది. టెండర్ల నిర్వహణ, కాంట్రాక్టర్ల ఖరారు, ఒప్పందాలు, అభివృద్ధి పనులు, నాణ్యతా ప్రమాణాలు, థర్డ్ పార్టీ విచారణ, బిల్లుల చెల్లింపులు ఇలా అన్నీ కాంట్రాక్టర్లు, ఇంజనీర్ల కనుసన్నల్లో గోప్యంగా జరిగిపోతున్నాయి. వరంగల్ మహా నగర పాలక సంస్థలో సాధారణ నిధులు, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల గ్రాంట్లు, ఇతర పథకాలు, జనరల్ ఫండ్స్‌తో ప్రస్తుతం రూ.200 కోట్ల వరకు అభివృద్ధి పనులు జరుగుతున్నాయి. వీటిలో చాలా మేరకు అవినీతి జరిగిందనే ఆరోపణలున్నాయి.

అంతా గప్‌చుప్..

నగర పాలక సంస్థలో ఈ–ప్రొక్యూర్‌మెంట్ విధానం ద్వారా టెండర్లను నిర్వహిస్తున్నారు. టెండర్లలో ఎవరు పాల్గొంటున్నారు? ఎంత మంది టెండర్ దరఖాస్తులు వేశారు? గ్రేటర్ ఇంజనీర్లు ప్రతిపాదించిన దాని కంటే తక్కువ శాతం లెస్ కోట్ చేశారా? ఎక్కువ శాతం కోట్ చేశారా? ఇలాంటి వివరాలు చెప్పేందుకు గ్రేటర్ ఇంజనీరింగ్ విభాగాధికారులు, సిబ్బంది నాన్చివేత ధోరణిని అవలంబిస్తున్నారు. ఎవరైనా సమాచార హక్కు చట్టం ద్వారా దరఖాస్తు పెడితే నెలల తరబడి కార్యాలయాల చుట్టూ తిప్పుకుంటున్నారు. రెండు, మూడు నెలలకు అందజేసినా తప్పుడు సమాచారం అందిస్తున్నారనే ఆరోపణలున్నాయి. గతేడాది ‘ఆన్‌లైన్’ ఎంబీలను నమోదు చేయకపోవడంపై బల్దియా బదిలీ కమిషనర్ పమేలా సత్పతి పేరిట ఓ సీసీ, డ్రైవర్ సుమారు రూ.3 కోట్ల నిధులను పక్కదారి పట్టించిన విషయం అందరికీ తెలిసిందే. అయినప్పటికీ ఉన్నతాధికారులు ఆ దిశగా ముందుకు సాగడం లేదు.

ఇప్పటికీ మ్యాన్యువల్..

సాంకేతికతను అందిపుచ్చుకోవడంలో ఇంజనీర్లు విఫలమవుతున్నారు. ఇప్పటికీ ఎంబీ పుస్తకాల్లో మాత్రమే వివరాలు నమోదు చేస్తున్నారు. కంప్యూటర్లు, ట్యాబ్‌ల ద్వారా ఎంబీ బుక్‌లను అంతర్జాలంలో నమోదు చేసేందుకు మొగ్గు చూపడం లేదు. ఆన్‌లైన్ విధానం వల్ల తమ అక్రమాల సాగవని మ్యానువల్ పద్ధతినే అవలంబిస్తున్నారనే విమర్శలున్నాయి. కాలనీల్లో జరుగుతున్న అభివృద్ధి పనులు ఎన్ని లక్షల రూపాయలతో చేస్తున్నారనే విషయం ఇంజనీర్లకు, కాంట్రాక్టర్లకు మాత్రమే తెలుసు. అభివృద్ధి పనులు, విస్తీర్ణం, ఎన్ని లక్షల రూపాయలు అనే వివరాల్ని వారు ఎక్కడా ప్రదర్శించడం లేదు.

పన్నులకో విధానం.. పనులకో విధానం

గ్రేటర్‌లో ఇటీవల ప్రతీ భవనాన్ని జియో ట్యాగింగ్ చేసే విధానం ప్రారంభించారు. తక్కువ పన్ను కడుతున్న, అసలు చెల్లించని భవనాల వివరాలు వెల్లడి కావడంతో ముక్కుపిండి మరీ పన్నులు వసూలు చేసేందుకు జియో ట్యాగింగ్ చేస్తున్నారు. వందలాది కోట్ల రూపాయలతో చేపడుతున్న అభివృద్ధి పనుల జియో ట్యాగింగ్, ఆన్‌లైన్‌లో ఎంబీ నమోదులో ఇంజనీర్లు నిర్లక్ష్య ధోరణిపై అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. కాంట్రాక్టర్లు ఇచ్చే కాసులకు కక్కుర్తి పడి ఇంజనీర్లు వెనుకంజ వేస్తున్నారనే విమర్శలున్నాయి. గ్రేటర్ పాలకవర్గం పెద్దలు, ఉన్నతాధికారులు దృష్టిసారించాల్సిన అవసరం ఉంది. దీంతో తప్పుడు అంచనాలకు అడ్డుకట్ట పడుతుంది. ఒకే ప్రాంతంలో పదే పదే పనులు చేయడానికి చెక్ పడనుంది.

సాంకేతికతకు దూరం

ఒక అర్హుడికి వ్యక్తిగత మరుగుదొడ్డి నిర్మించే స్థలాన్ని.. ఆ ప్రాంత అక్షాంశాలు, రేఖాంశాలను బట్టి భౌగోళిక ఆధారంగా జియో ట్యాగింగ్ నమోదు చేస్తున్నారు. జియో ట్యాగింగ్ యాప్‌లో మొదటి, రెండో దశలో, పూర్తయిన తర్వాత మూడో దశలో ఫొటోలు తీసి అప్‌లోడ్ చేస్తున్నారు. మూడు దశల్లో జియో ట్యాగింగ్ చేసి రూ.12 వేలు ఆన్‌లైన్‌లో పంపిణీ చేస్తూ పారదర్శకత సాగిస్తున్నారు. వందల కోట్ల రూపాయలు వెచ్చించి రహదారులు, డ్రెయినేజీలు, కల్వర్టులు, పైపులైన్లు, శ్మశాన వాటికలు, కమ్యూనిటీ హాళ్లు, డివైడర్లు, పార్కులు, జంక్షన్లు ఇలా పెద్ద ఎత్తున అభివృద్ధి పనులు జరుగుతుంటాయి. ఈపనులకు జియో ట్యాగింగ్ చేయడంలో ఇంజనీర్లు పూర్తిగా నిర్లక్ష్యం వహిస్తున్నారు.

క్లుప్తంగా

వాహనం నుంచి పడిన తుపాకీ

- పోలీస్ స్టేషన్‌లో అప్పగించిన ఆటో డ్రైవర్

వరంగల్ : భీమారంలోని సీఆర్పీఎఫ్ 58వ బెటాలియన్ నుంచి మణిపూర్‌కు వెళ్తున్న సైనికుల వాహనం నుంచి తుపాకీ (కార్బన్) పడిపోయింది. కాగా పైడిపల్లికి చెందిన ఆటో డ్రైవర్ ధరావత్ శ్రీను వరంగల్ వైపునకు ఆటోతో వెళ్తుండగా ఎంజీఎం జంక్షన్‌లో రోడ్డుపై తుపాకీ(కార్బన్) కనిపించింది. వెంటనే దానిని తీసుకొని మట్టెవాడ పోలీస్‌స్టేషన్‌లో ఇన్‌చార్జ్ హెడ్ కానిస్టేబుల్ ధర్మానాయక్‌కు అప్పగించాడు. కొద్ది నిమిషాల్లోనే తుపాకీ సిల్లింగ్ ఊడిపోయి వాహనం నుంచి జారిపడిన శబ్దం వచ్చిందని, ఆ ప్రాంతంలో పరిశీలిస్తే తుపాకీ కనిపించలేదని సీఆర్పీఎఫ్ హెడ్ కానిస్టేబుల్ రాజేష్ కుమార్ పోలీస్ స్టేషన్‌కు వచ్చి ఫిర్యాదు చేశాడు. దీంతో అక్కడే ఉన్న తుపాకీని చూసి ఇది తనదే అని చెప్పాడు. దీంతో పోలీసులు అతని వివరాలు తీసుకుని తుపాకీ (కార్బన్) అతనిదేనని నిర్ధారించుకొని అప్పగించారు. ఈ విషయాన్ని వెంటనే ఉన్నత స్థాయి అధికారులకు తెలియజేసినట్లు మట్టెవాడ పోలీసులు పేర్కొన్నారు.

టెక్నాలజీతో పారదర్శకత

- రిజిస్ట్రార్ ప్రొఫెసర్ పి.మల్లారెడ్డి


మాట్లాడుతున్న మల్లారెడ్డి

కేయూ క్యాంపస్ : ఉద్యోగులు తమ విధుల నిర్వహణలో టెక్నాలజీ వినియోగంతో పారదర్శకత సాధ్యపడుతుందని కాకతీయ యూనివర్సిటీ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ పి.మల్లారెడ్డి అన్నారు. విశ్వవిద్యాలయంలో పనిచేస్తున్న ఉద్యోగుల్లో ఎంపిక చేసిన వారికి నాలుగు వారాల కెపాసిటీ బిల్డింగ్ ప్రోగ్రాంలో భాగంగా యూనివర్సిటీ కంప్యూటర్స్ విభాగంలో నిర్వహిస్తున్న శిక్షణ కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ఎంఎస్ ఎక్సెల్ వినియోగంతో లెక్కలు, పద్దులు, జీతాల బిల్లుల తయారీలో మెళకువలు నేర్చుకోవాలని మల్లారెడ్డి ఉద్యోగులకు వివరించారు. ఈ కార్యక్రమంలో కంప్యూటర్ సైన్స్ విభాగం అధిపతి డాక్టర్ రమ, మంజుల తదితరులు పాల్గొన్నారు.

నకిలీ వైద్యుడిపై కేసు


సీజ్ చేసిన మందులు చూపుతున్న అధికారులు

లింగాలఘణపురం : మండలంలోని నవాబుపేటకు చెందిన అలికట్టి కృష్ణ ఎలాంటి అర్హత లేకుండా క్లినిక్ నిర్వహిస్తున్నాడు. అంతేకాకుండా అనుమతి లేని అల్లోపతి మందులను విక్రయించేందుకు నిల్వ చేయడంతో కేసు నమోదైంది. శుక్రవారం ఔషధ నియంత్రణ శాఖ సంచాలకులు డాక్టర్ రాజ్యలక్ష్మి పర్యవేక్షణలో జనగామ, వరంగల్ జిల్లా ఔషధ తనిఖీ అధికారులు బాలకృష్ణ, అరవింద్ ఆధ్వర్యంలో సంయుక్తంగా దాడులు నిర్వహించారు. ఈ దాడిలో సుమారు రూ.25వేల విలువైన మందులను సీజ్ చేసి ఫస్ట్ క్లాస్ మెజిస్ట్రేట్ కోర్టులో సమర్పించారు.



రూ.200కోట్ల పైనే..

పేరుకుపోయిన లైబ్రరీ పన్ను

- చెల్లించాలని కార్పొరేషన్‌కు గ్రంథాలయ సంస్థ ప్రతిపాదనలు
- ఏళ్ల తరబడి భర్తీకాని ఖాళీలు

హన్మకొండ చౌరస్తా : గ్రంథాలయాలు విజ్ఞాన భాండాగారాలు.. అందుకే చినిగిన చొక్కా అయినా వేసుకో మంచి పుస్తకం కొనుక్కో అని మహనీయులు బోధించారు.మారుతున్న కాలానికి అనుగుణంగా, ఆధునిక సాంకేతికతను అందిపుచ్చుకుని గ్రంథాలయాలను తీర్చిదిద్దాల్సిన అవసరం ఉంది. కానీ పదేళ్లలో కేంద్ర ప్రభుత్వ నిధులతో వరంగల్ సెంట్రల్ లైబ్రరీ, హనుమకొండ జిల్లా గ్రంథాలయాలు మాత్రమే వసతుల కల్పనకు నోచుకున్నాయి. గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని ప్రధానమైన వరంగల్, హనుమకొండ జిల్లాల పరిధిలోని 90 శాతానికి పైగా గ్రంథాలయాలు అరకొర వసతులు, సిబ్బంది లేమితో నెట్టుకొస్తున్నాయి. పదేళ్ల కాలంలో రాష్ట్ర ప్రభుత్వం గ్రంథాలయ శాఖలోని ఖాళీ ఉద్యోగాలను భర్తీ, వసతుల కల్పన కోసం తీసుకున్న చర్యలు శూన్యం.


హనుమకొండ జిల్లా కేంద్ర గ్రంథాలయం

ఖాళీలు ఇలా..

గ్రేడ్–2 లైబ్రేరియన్‌లు ముగ్గురికి గానూ హనుమకొండ, పరకాల లైబ్రరీలో రెండు పోస్టులు ఖాళీగా ఉన్నాయి. ఆత్మకూర్, శాయంపేట, వంగర, ఎల్కతుర్తి, కమలాపూర్, భీమదేవరపల్లి శాఖ గ్రంథాలయాల్లో గ్రేడ్–3 లైబ్రేరియన్ పోస్టులు ఖాళీగా ఉన్నాయి. హనుమకొండ జిల్లా గ్రంథాలయంలో రికార్డు అసిస్టెంట్ పోస్టులు(2) ఖాళీగా ఉన్నాయి. అటెండర్లు హనుమకొండ, హసన్‌పర్తి, పరకాల, ఆత్మకూర్‌లో (6) అటెండర్ పోస్టులను భర్తీ చేయాల్సి ఉంది. పబ్లిక్‌గార్డెన్‌లో బాలల గ్రంథాలయం, పరకాలకు వాచ్‌మన్ (2) పోస్టులు, హనుమకొండ గ్రంథాలయంలో (2) బుక్‌బైండర్ పోస్టులు ఖాళీగా ఉన్నాయి.

వరంగల్‌లో ఖాళీలు..

నర్సంపేటలో గ్రేడ్–2 లైబ్రేరియన్ (1), పర్వతగిరి, రాయపర్తి, ఖానాపూర్, సంగెం, నల్లబెల్లి, చెన్నారావుపేట, దుగ్గొండి, నెక్కొండ, గీసుకొండ, వర్ధన్నపేట శాఖ గ్రంథాలయాలకు గ్రేడ్–3 లైబ్రేరియన్ పోస్టులు ఖాళీగా ఉన్నాయి. వరంగల్, పర్వతగిరి, వర్ధన్నపేట లైబ్రరీలో–3 అటెండర్ పోస్టులు, రాయపర్తి, నర్సంపేటలో–2 వాచ్‌మన్ పోస్టులు ఖాళీగా ఉన్నాయి.

సెస్ అంటే..

గ్రంథాలయాల నిర్వహణకు నిధుల సేకరణ కోసం ప్రత్యేక చట్టాన్ని రూపొందించారు. అందుకోసం గ్రంథాలయాలను స్థానిక సంస్థల పరిధిలో చేర్చుతూ అప్పటి ప్రభుత్వం 1960లో ఓ చట్టాన్ని తీసుకొచ్చింది. రాష్ట్రంలోని గ్రామపంచాయతీలు, మున్సిపాలిటీ, కార్పొరేషన్లకు ప్రజలు చెల్లిస్తున్న వివిధ పన్నులలో 8 శాతం గ్రంథాలయాలకు కేటాయించాలని చట్టం చెబుతోంది. పంచాయతీ, మున్సిపల్, కార్పొరేషన్‌ల నుంచి వచ్చే 8 శాతం నిధులతో గ్రంథాలయాల నిర్వహణ, వసతుల కల్పన, ఉద్యోగాల భర్తీ, ఇతర అభివృద్ధి కార్యక్రమాలను చేసుకునేలా చట్టాన్ని రూపొందించారు.

పదేళ్లలో చెల్లించాల్సిన సెస్ రూ.200 కోట్ల పైనే..

వరంగల్, హనుమకొండ జిల్లా గ్రంథాలయాలకు సెస్ నిధులను గడిచిన పదేళ్లలో ఒక్క రూపాయి చెల్లించలేదు. అనధికారిక లెక్కల ప్రకారం 2014 నుంచి 2024 వరకు హనుమకొండ, వరంగల్ జిల్లాలకు మున్సిపల్ కార్పొరేషన్ నుంచి రావాల్సిన సెస్ దాదాపు రూ.200ల కోట్లకు పైనే ఉంటాయని గ్రంథాలయ సంస్థ తెలియజేస్తుంది. అధికారికంగా లెక్కలు తీస్తే రూ.400ల కోట్ల వరకు చెల్లించాల్సి ఉంటుందని అంచనా వేస్తున్నారు.

సాంకేతిక లోపంతో చెల్లింపులు లేవు?

మున్సిపల్ కార్పొరేషన్ ప్రతి ఏటా రూపొందించే డిమాండ్ కలెక్షన్ బ్యాలెన్స్ ప్రకారం చెల్లింపులు జరుగుతున్న పన్నులలో చట్ట ప్రకారం గ్రంథాలయ సంస్థకు రావాల్సిన 8 శాతం వాటాను అంచనా వేస్తుంటారు. గ్రంథాలయ సంస్థ అంచనా ప్రకారం గత పదేళ్లలో రావాల్సిన వాటా రూ.200ల కోట్లకు పైగా ఉంటుందని చెబుతున్నారు. గ్రంథాలయాలకు సెస్ చెల్లింపుల కోసం తెలంగాణ రాష్ట్రంలో ప్రత్యేక సాఫ్ట్‌వేర్‌ను రూపొందించారు.అయితే సాంకేతిక కారణాల వల్ల సెస్ చెల్లింపులో జాప్యం జరుగుతుందని మున్సిపల్ అధికారులు చెబుతున్నారు. లైబ్రరీ యాక్ట్–1960 ప్రకారం చెల్లించాల్సిన 8శాతం సెస్‌లో గత పదేళ్లుగా బకాయి ఉన్నట్లు గ్రంథాలయ సంస్థ అధికారులు చెబుతున్నారు.

సీఎం దృష్టికి తీసుకెళ్తా..



యువతకు మార్గదర్శకంగా తీర్చిదిద్దాల్సిన గ్రంథాలయాలను గత ప్రభుత్వం పూర్తిగా విస్మరించింది. పదేళ్ల గ్రంథాలయాల అభివృద్ధికి నిధులు విడుదల చేయకుండా నిర్లక్ష్యంగా వ్యవహరించింది. మంత్రి పొన్నం ప్రభాకర్ సమక్షంలో ఇటీవల సమావేశం నిర్వహించాం. రాష్ట్రవ్యాప్తంగా గ్రంథాలయాల దుస్థితి, అభివృద్ధి, సెస్ ఇతర సమస్యలను త్వరలోనే సీఎం రేవంత్ రెడ్డి దృష్టికి తీసుకెళ్తా. పటిష్టమైన ప్రణాళికతో గ్రంథాలయాలను అభివృద్ధి చేస్తాం.

– మహ్మద్ రియాజ్, చైర్మన్ తెలంగాణ గ్రంథాలయ పరిషత్

బకాయి అంచనా పంపించాం..



మున్సిపల్ కార్పొరేషన్ డిమాండ్ కలెక్షన్ బ్యాలెన్స్ ప్రకారం లైబ్రరీకి రావాల్సిన 8 శాతం సెస్ అంచనా వేసి ప్రతిపాదనలను కార్పొరేషన్‌కు అందజేశాం. అంచనా ప్రకారం రూ.200ల కోట్లకు పైనే రావాల్సి ఉంది. పదేళ్లకు చెల్లించాల్సిన మొత్తాన్ని గ్రంథాలయానికి అందజేస్తే జిల్లాలోని ఆయా గ్రంథాలయాల్లో ఖాళీలను భర్తీ చేసి, నిర్వహణ భారం ప్రభుత్వంపై పడకుండా ఉంటుంది.

– శశిజాదేవి, కార్యదర్శి, జిల్లా గ్రంథాలయ సంస్థ, హనుమకొండ

వరంగల్ మార్కెట్‌కు మూడు రోజులు సెలవు

వరంగల్ : ఏనుమాములలోని వరంగల్ వ్యవసాయ మార్కెట్‌కు వరుసగా మూడు రోజులు సెలవుల కారణంగా బంద్ ఉంటుందని మార్కెట్ కమిటీ ఉన్నత శ్రేణి కార్యదర్శి పి.నిర్మల ఒక ప్రకటనలో తెలిపారు. 24న శనివారం(వారంతపు యార్డు బంద్), 25న ఆదివారం(వారంతపు సెలవు), 26న సోమవారం(శ్రీకృష్ణజన్మాష్టమి) ఉన్నందున శనివారం నుంచి సోమవారం వరకు మార్కెట్ బంద్ ఉంటుందని తెలిపారు. 27వ తేదీ మంగళవారం మార్కెట్ పునఃప్రారంభం అవుతుందని పేర్కొన్నారు. ఈవిషయాన్ని రైతులు, వ్యాపారస్తులు, గుమాస్తా, దడువాయి, కార్మికులు గమనించాలని కోరారు.

నిట్‌లో నేషనల్ స్పేస్ డే


స్పేస్ డే వేడుకలో ఇస్రో సైంటిస్ట్ వీఎం.చౌదరి

కాజీపేట అర్బన్ : నిట్ వరంగల్‌లోని సెమినార్ హాల్ కాంప్లెక్స్‌లో శుక్రవారం నేషనల్ స్పేస్ డేను ఘనంగా నిర్వహించారు. నేషనల్ స్పేస్ డే వేడుకలకు ముఖ్య అతిథిగా నేషనల్ రిమోట్ సెన్సింగ్ సెంటర్ (ఎన్ఆర్ఎస్సీ) ఇస్రో సైంటిస్ట్ డాక్టర్ వీఎం.చౌదరి హాజరై నగరంలోని వివిధ పాఠశాలల నుంచి వచ్చిన విద్యార్థులతో మాట్లాడారు. విద్యార్థి దశ నుంచే పరిశోధనలపై ఆసక్తిని పెంపొందించుకుని సైంటిస్ట్‌లుగా రాణించాలని, స్పేస్ పై పరిశోధనలను చేపట్టేందుకు సిద్ధం కావాలని సూచించారు. ఆహార భద్రత కోసం స్పేస్ అనే అంశంపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. ప్రస్తుత ట్రెండ్ చంద్రుడి అన్వేషణలో కొనసాగుతుందని ఇందుకు విద్యార్థులు ఆసక్తిని పెంపొందించుకుని ముందుకు సాగాలని స్కైరూట్ ఏరోస్పేస్ ఇస్రో వైస్ ప్రెసిడెంట్ డాక్టర్ సీవీఎస్.కిరణ్ తెలిపారు. కార్యక్రమంలో నిట్ డైరెక్టర్ బిద్యాధర్ సుబుదీ, ప్రొఫెసర్లు శిరీష్ సోనావానే, ఆంజనేయులు, హరినాథ్, సంపత్ కుమార్, ఉదయ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

రెప్పపాటులో తప్పిన ప్రమాదం

- ప్రయాణికుడిని కాపాడిన రైల్వే పోలీస్


ప్రయాణికుడిని కాపాడుతున్న పోలీస్ (సీసీ ఫుటేజీ)

కాశిబుగ్గ : వరంగల్ రైల్వేస్టేషన్‌లో గురువారం రాత్రి కదులుతున్న రైలులో ఫుట్‌బోర్డ్‌పై వేళాడుతూ పడిపోతున్న ఓ ప్రయాణికుడుని ఆర్పీఎఫ్ పోలీసులు కాపాడారు. ఆర్పీఎఫ్ ఎస్సై జి.వెంకటేశ్వర్లు తెలిపిన వివరాల ప్రకారం..ఆంధ్రప్రదేశ్‌లోని శ్రీకాకుళం జిల్లా బిట్వాడ మండలం వీరగట్టుకు చెందిన అట్టాడ అన్నమనాయుడు వరంగల్ నుంచి చీపురుపల్లి వెళ్తున్నాడు. అయితే రైలు కదులుతుండగా అన్నమనాయుడు బ్యాగుతో పాటు రైలెక్కి ఫుట్‌బోర్డుపై వేళాడుతూ కింద పడిపోతుండగా ప్లాట్‌ఫాం–1లో విధులు నిర్వహిస్తున్న ఆర్పీఎఫ్ కానిస్టేబుల్ మోహన్ గమనించి పరుగెత్తి ప్రయాణికుడిని చాకచక్యంగా బయటకు లాగాడు. రెప్పపాటులో ప్రయాణికుడు రైలు కింద పడిపోయేవాడని, కానిస్టేబుల్ మోహన్ కాపాడడంతో ఆర్పీఎఫ్ ఉన్నతాధికారులు, ప్రయాణికులు అభినందించారు. అనంతరం ప్రయాణికుడిని స్టేషన్‌కు తరలించి కౌన్సిలింగ్ ఇచ్చి మరో రైలులో పంపించామని ఎస్సై తెలిపారు.

రుణ వితరణ, రికవరీపై చర్చ

- నాబార్డ్ సహకార క్రెడిట్ విధానాల సదస్సులో పాల్గొన్న మార్నేని

హన్మకొండ : ముంబైలోని నేషనల్ బ్యాంక్ ఫర్ అగ్రికల్చర్ అండ్ రూరల్ డెవలప్‌మెంట్ (నాబార్డు) ప్రధాన కార్యాలయంలో రాష్ట్ర సహకార బ్యాంకుల జాతీయ సమాఖ్య ఆధ్వర్యంలో స్వల్పకాలిక సహకార క్రెడిట్ విధానాలపై జరిగిన సదస్సులో తెలంగాణ స్టేట్ అపెక్స్ బ్యాంక్ చైర్మన్ మార్నేని రవీందర్ రావుతో పాటు రాష్ట్రంలోని డీసీసీబీల చైర్మన్లు పాల్గొన్నారు. శుక్రవారం నాబార్డు చైర్మన్ షాజీ కేవీ ముఖ్యఅతిథిగా పాల్గొన్న ఈ సమావేశంలో సహకార బ్యాంకులో రుణ వితరణ, రికవరీపై విధానాలపై చర్చించినట్లు రవీందర్ రావు తెలిపారు.


షాజీ కె.వికి పుష్పగుచ్ఛం అందజేస్తున్న మార్నేని రవీందర్ రావు, డీసీసీబీ చైర్మన్లు

‘ఓపెన్’గా చదివేద్దాం..

- అంబేడ్కర్ వర్సిటీలో నాణ్యమైన విద్య
- డిగ్రీ, పీజీ కోర్సుల్లో ప్రవేశాలు పొందాలి
- యూనివర్సిటీ జాయింట్ డైరెక్టర్ ప్రొఫెసర్ వెంకటేశ్వర్లు


సమావేశంలో మాట్లాడుతున్న వెంకటేశ్వర్లు, పక్కన ప్రిన్సిపాల్ జ్యోతి తదితరులు

కేయూ క్యాంపస్ : డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ ఓపెన్ యూనివర్సిటీలో 2024–25 విద్యా సంవత్సరానికి గాను డిగ్రీ(యూజీ) బీఏ, బీకాం, బీఎస్సీ కోర్సుల్లోను, పీజీ ఎంఏ, ఎంకామ్, ఎమ్మెస్సీ, బీఎల్ఐఎస్సీ, ఎంఎల్ఐఎస్సీ తదితర డిప్లొమా కోర్సుల్లో ప్రవేశాలకు ఈనెల 31వ తేదీలోగా ఆసక్తిగల అభ్యర్థులు ప్రవేశాలు పొందాలని హైదరాబాద్‌లోని అంబేడ్కర్ ఓపెన్ యూనివర్సిటీ జాయింట్ డైరెక్టర్, అదనపు పరీక్షల నియంత్రణాధికారి ప్రొఫెసర్ డాక్టర్ వై.వెంకటేశ్వర్లు తెలిపారు. శుక్రవారం హనుమకొండలోని యూనివర్సిటీ ఆర్ట్స్‌అండ్ సైన్స్ కళాశాలలోని అంబేడ్కర్ యూనివర్సిటీ వరంగల్ ప్రాంతీయ అధ్యయన కేంద్రాన్ని ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా రీజినల్ కోఆర్డినేటర్, కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య ఎస్.జ్యోతితో కలిసి నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. పలు కారణాలతో రెగ్యులర్ విద్యను నిలిపి వేసిన విద్యార్థులు కూడా ఓపెన్ యూనివర్సిటీలో చదువుకునే అవకాశం ఉంటుందన్నారు. డిగ్రీ కోర్సులు సెమిస్టర్ సిస్టంలోను, పీజీ కోర్సులు ఇయర్‌వైజ్ స్కీంలో నిర్వహిస్తున్నామన్నారు. కాంటాక్ట్ తరగతులతో పాటు స్టడీ మెటీరీయల్‌ను అందజేస్తున్నామన్నారు. వివిధ వృత్తిలో పనిచేస్తూ కూడా ఓపెన్ వర్సిటీలో డిగ్రీ, పీజీ కోర్సులను పూర్తిచేసుకునే అవకాశం ఉందన్నారు.తెలంగాణ రాష్ట్రంలోని స్టడీ సెంటర్లలో ప్రవేశాలు పొందేందుకుగాను విద్యార్హతలు, ఫీజులు, కోర్సుల వివరాలను ఆయన ఈ సందర్భంగా వెల్లడించారు. డబ్ల్యూడబ్ల్యూడబ్ల్యూ.బీఆర్ఏఓయూఆన్‌లైన్.ఇన్ లేదా డబ్ల్యూడబ్ల్యూడబ్ల్యూ.బీఆర్ఏఓయూ.ఏసీ.ఇన్‌లో పొందవచ్చని ఆయన పేర్కొన్నారు. సమావేశంలో అంబేడ్కర్ ఓపెన్ యూనివర్సిటీ తెలుగు విభాగం అధిపతి ప్రొఫెసర్ రజని, ఆర్ట్స్‌అండ్ సైన్స్ కళాశాల వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ పుల్లా రమేష్, అసిస్టెంట్ రిజిస్ట్రార్ పెండ్లి అశోక్‌బాబు, డాక్టర్ ఆదిరెడ్డి పాల్గొన్నారు.

ద్వితీయ, తృతీయ సంవత్సరం విద్యార్థులు ఫీజు చెల్లించాలి

ద్వితీయ, తృతీయ సంవత్సరం చదువుతున్న విద్యార్థులు ఈనెల 31వ తేదీలోపు ట్యూషన్ ఫీజు చెల్లించాలని వర్సిటీ జేడీ ప్రొఫెసర్ వెంకటేశ్వర్లు తెలిపారు. పూర్తి సమాచారం కోసం, సందేహాలుంటే సమీపంలోని అధ్యయన కేంద్రాల్లో సంప్రదించాలన్నారు. డిగ్రీ, పీజీ పూర్వవిద్యార్థులు రెండో, మూడో సంవత్సరంలో సకాలంలో ఫీజులు చెల్లించలేకపోయిన వారు 2015–16నుంచి 2023–24వరకు అడ్మిషన్లు పొంది ఉంటే వారు కూడా ఫీజులు చెల్లించేందుకు ఈనెల 31వరకు గడువు ఉందని తెలిపారు.

పరీక్ష కేంద్రం తనిఖీ

డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ ఓపెన్ యూనివర్సిటీ పీజీ కోర్సుల పరీక్షలు హనుమకొండలోని యూనివర్సిటీ ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాలలో శుక్రవారం నుంచి నిర్వహిస్తున్నారు. కాగా పరీక్ష కేంద్రాన్ని యూనివర్సిటీ జాయింట్ డైరెక్టర్, అదనపు పరీక్షల నియంత్రణాధికారి ప్రొఫెసర్ డాక్టర్ వై.వెంకటేశ్వర్లుతో పాటు ప్రొఫెసర్ రజని తనిఖీ చేశారు.

కలెక్టర్‌ను కలిసిన మార్కెటింగ్‌శాఖ సెంట్రల్ కమిటీ


కలెక్టర్‌కు పుష్పగుచ్ఛం ఇస్తున్న కమిటీ బాధ్యులు

వరంగల్: కలెక్టర్ సత్య శారదను రాష్ట్ర మార్కెటింగ్ శాఖ సెంటల్ కమిటీ అధ్యక్ష, కార్యదర్శులు నర్సింహారెడ్డి, ముక్రం శుక్రవారం మర్యాద పూర్వకంగా కలసి పుష్పగుచ్ఛం అందజేశారు. అంతకుముందు వరంగల్ మార్కెట్ కమిటీ కార్యాలయంలో జరిగిన సమావేశంలో మార్కెటింగ్ శాఖ ఉద్యోగులు రైతులకు మెరుగైన సేవలు అందించాలని కోరారు. కార్యక్రమంలో మార్కెట్ ఉన్నత శ్రేణి కార్యదర్శి పి.నిర్మల, మార్కెట్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

1న జిల్లా స్థాయి స్కేటింగ్ పోటీలు

వరంగల్ స్పోర్ట్స్ : సెప్టెంబర్ 1వ తేదీన ఉమ్మడి జిల్లా స్థాయి అండర్–5 నుంచి అండర్–18 బాలబాలికల రోలార్ స్కేటింగ్ పోటీలను నిర్వహిస్తున్నట్లు వరంగల్ స్కేటింగ్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు బండి సిద్దార్థ్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. రాంపూర్‌లోని ఢిల్లీ పబ్లిక్ స్కూల్ ఆవరణలో నిర్వహించే ఎంపికలలో పాల్గొనే క్రీడాకారులు తమ పేర్ల ను రిజిస్ట్రేషన్ చేసుకోవాలని తెలిపారు. ఇతర వివరాలకు 63015 91754, 83318 14164 నంబర్‌లలో సంప్రదించాలని పేర్కొన్నారు.

రెండు కార్లు ఢీ.. ఒకరి మృతి

శాయంపేట : ఎదురెదురుగా రెండు కార్లు ఢీకొన్న ఘటనలో ఒకరు మృతి చెందగా మరొకరికి కాలు విరిగింది. మిగిలిన వారికి స్వల్ప గాయాలైన సంఘటన శుక్రవారం సాయంత్రం కొత్తగట్టు సింగారం శివారులో చోటు చేసుకుంది. ఎస్సై ప్రమోద్‌కుమార్ కథనం ప్రకారం.. వరంగల్‌లోని నాయుడు పెట్రోల్ పంపు ప్రాంతానికి చెందిన జన్ను ఎల్లయ్య, నాగమ్మ, నరేందర్, సబితారాణి పరకాలలో తమ బంధువుల వివాహానికి హాజరై కారులో తిరిగి ఇంటికి వెళ్తున్నారు.అదే విధంగా భూపాలపల్లి చెందిన సిలువేరి శివకుమార్, ఉదయ్‌కుమార్, మమత, పద్మావతి, అద్విక్‌రాయ్ వరంగల్ నుంచి భూపాలపల్లికి కారులో వెళ్తున్నారు. పరకాల–హనుమకొండ ప్రధాన రహదారిలోని కొత్తగట్టు సింగారం శివారులో వీరు ప్రయాణిస్తున్న కార్లు ఎదురెదురుగా అతివేగంతో వచ్చి ఢీకొనడంతో జన్ను మల్లయ్యకు తీవ్ర గాయాలయ్యాయి. కాగా చికిత్స నిమిత్తం ఆస్పత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలో మల్లయ్య మృతి చెందాడు. మరో కారులో ప్రయాణిస్తున్న సిలువేరి పద్మావతి కాలు విరగగా మిగిలిన వారికి స్వల్ప గాయాలయ్యాయి. విషయం తెలుసుకున్న ఎస్సై సంఘటన స్థలానికి చేరుకొని దర్యాప్తు చేపట్టారు.

పట్టాలు, మీటర్లు ఇప్పిస్తామని వసూళ్లు

వరంగల్: పేదలు ప్రభుత్వ భూముల్లో వేసుకున్న గుడిసెలను క్రమబద్ధికరించేందుకు ప్రభుత్వం జీఓ నంబర్ 58, 59ను ప్రభుత్వం జారీ చేసింది. ఈ జీఓలను ఆసరాగా చేసుకుని వరంగల్‌కు చెందిన ఒక సీనియర్ నాయకుడు మరో చోటా నాయకుడిని రంగంలోకి దింపి సర్వే నంబర్ 100లో నివాసముంటున్న పేదలకు పట్టాలిప్పిస్తామని సుమారు రూ.18 లక్షలు వసూలు చేసిన విషయం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. ఈవిషయాన్ని ఆసరాగా చేసుకుని ఇదే డివిజన్‌కు చెందిన ఒక ప్రజాప్రతినిధితో చేతులు కలిపిన సీనియర్ కాంగ్రెస్ నాయకుడు (టీపీసీసీ కార్యదర్శి) గుడిసెవాసులకు పట్టాలు మంజూరు చేయిస్తామని, కొత్త కరెంట్ మీటర్లు అందిస్తామని నమ్మబలికి ఇంటికి రూ.10 వేలు వసూళ్లు చేసినట్లు సమాచారం. డబ్బులు వసూలు చేసి నెలలు గడుస్తున్నా పట్టాల విషయం కొలిక్కి రాకపోవడంతో ఇటీవల గుడిసెవాసులు వరంగల్ తూర్పు ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో మాజీ ఎమ్మెల్సీ కొండా మురళిని కలిసి బాధ వెళ్లబోసుకున్నారు. ఆయన సదరు నాయకుడికి ఫోన్ చేసి వారి నుంచి తీసుకున్న డబ్బులు వాపస్ చేయాలన్నట్లు తెలిసింది. ఈవ్యవహారం బయటకు పొక్కకుండా సమస్యకు పరిష్కరించాలని తూర్పులో పాలన వ్యవహారాల్లో చక్రం తిప్పుతున్న తన అనుయాయుడికి ఆదేశాలు జారీ చేసినట్లు తెలిసింది. ఈవిషయంపై ఇప్పటి వరకు బాధితులు తమకు ఫిర్యాదు చేయలేదని స్థానిక ఇంతేజార్ గంజ్ పోలీసులు తెలిపారు.

ప్రజల దృష్టి మరల్చేందుకే ఆరోపణలు

- సీపీఐ జాతీయ కార్యదర్శి డాక్టర్ కె.నారాయణ
- కొనసాగుతున్న రాష్ట్ర నిర్మాణ కౌన్సిల్ సమావేశాలు


రాజాకు చెక్కు అందజేస్తున్న నాయకులు

సాక్షిప్రతినిధి, వరంగల్ / న్యూశాయంపేట : తెలంగాణలో ప్రజా సమస్యల నుంచి దృష్టిని మరల్చేందుకు బీజేపీ, బీఆర్ఎస్ పార్టీ ఫిరాయింపులపై పరస్పరం ఆరోపణలు చేసుకుంటున్నాయని సీపీఐ జాతీయ కార్యదర్శి డా.కె.నారాయణ అన్నారు. హనుమకొండలో జరుగుతున్న సీపీఐ తెలంగాణ రాష్ట్ర సమితి నిర్మాణ సమావేశాల సందర్భంగా శుక్రవారం కాకతీయ హరిత హోటల్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో మాజీ ఎంపీ సయ్యద్ అజీజ్ పాషా, రాష్ట్ర కార్యదర్శి, ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు తదితరులతో కలిసి నారాయణ మాట్లాడారు. బీజేపీలో బీఆర్ఎస్ విలీనమవుతుందని సీఎం రేవంత్ రెడ్డి చెబుతుండగా, రేవంత్ రెడ్డే బీజేపీలో చేరుతారని బీఆర్ఎస్ నేతలు అంటున్నారని ఉదహరించారు. ఆయా పార్టీలు కలిసి రాజకీయ క్రీడ ఆడుతున్నాయని ఎద్దేవా చేశారు. ఎస్సీ రిజర్వేషన్ వర్గీకరణపై సుప్రీం కోర్టు ఇచ్చిన తీర్పును సీపీఐ స్వాగతిస్తోందని, అయితే వర్గీకరణకు, క్రిమిలేయర్ సంబంధం లేదని, కోర్టులో విచారణ సందర్భంగా తాము ఈ విషయాన్ని తెలియజేస్తామన్నారు. మాజీ ఎంపీ అజీజ్‌పాషా మాట్లాడుతూ.. బడ్జెట్‌లో వైద్య రంగానికి కేవలం 1.35 శాతం ఖర్చు చేయడం సిగ్గుచేటని, ఇది వైద్య రంగంపై ప్రభుత్వానికి ఉన్న చిత్తశుద్ధిని తెలియజేస్తోందని విమర్శించారు. రాష్ట్ర కార్యదర్శి, ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు మాట్లాడుతూ పార్టీ రాష్ట్ర నిర్మాణ కౌన్సిల్ సమావేశాలు శనివారంతో ముగుస్తాయని తెలిపారు. ముగింపు సమావేశాల్లో కీలక నిర్ణయాలు తీసుకోవడం జరుగుతుందని, వాటిని ప్రకటిస్తామన్నారు. సమావేశంలో సీపీఐ కార్యదర్శివర్గ సభ్యుడు పల్లా వెంకట్ రెడ్డి, తక్కెళ్లపల్లి శ్రీనివాస్, పశ్యపద్మ, కలవేణ శంకర్, ఎం.బాలనరసింహ, రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు బి.విజయ సారథి, మర్రి వెంకటస్వామి, హన్మకొండ జిల్లా కార్యదర్శి కర్రె భిక్షపతి పాల్గొన్నారు.

వయనాడ్ బాధితులకు సీపీఐ విరాళం


వయనాడ్ బాధితుల కోసం సీపీఐ రాష్ట్ర తెలంగాణ సమితి రూ.5.41లక్షల ఆర్థికసాయాన్ని అందించింది. ఈ మేరకు హనుమకొండలో జరుగుతున్న సీపీఐ రాష్ట్ర నిర్మాణ కౌన్సిల్ సమావేశాల సందర్భంగా శుక్రవారం సీపీఐ జాతీయ ప్రధాన కార్యదర్శి డి.రాజాకు రాష్ట్ర సమితి తరపున పార్టీ రాష్ట్ర కార్యదర్శి, ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు చెక్కును అందజేశారు.

జడివాన

వర్షంలో తడుస్తూ వెళ్తున్న వాహనదారులు



అంబేడ్కర్ భవన్ ఎదుట ప్రవహిస్తున్న వరద



వరంగల్ నగరంలో శుక్రవారం మధ్యాహ్నం జడివాన కురిసింది. మధ్యాహ్నం వరకు ఉక్కపోతగా ఉండడం.. ఆ తర్వాత ఆకాశం మేఘావృతం కావడంతో వాతావరణం పూర్తిగా మారింది. ఒక్కసారిగా గంటపాటు భారీ వర్షం కురిసింది. దీంతో లోతట్టు రోడ్లపై వరద చేరింది. కాకాజీకాలనీ, హనుమకొండ బస్టాండ్ ప్రాంతాలు జలమయమయ్యాయి. – సాక్షి ఫొటోగ్రాఫర్, హన్మకొండ